# బొమ్మలాంతరు

డాక్టర్ కైలాసంగారు పరమ నాస్తికులు. అతనికి దేముడు-దయ్యం, పుణ్యం-మోక్షం, స్వర్గం-నరకం మీద నమ్మకం లేదు. పూజలు, నోములు, వ్రతాలూ ఏవీ నప్పవు. బాబాలూ, సాధువులు, స్వామీజీలు అంటే ఎలర్జీ! 'వారంతా లేజీఫెలోస్, సంఘానికి చీడపురుగులు! అని ఆయన భావన.

డాక్టర్‌కైలాసంగారు తన భావాల్ని, ఉద్దేశాల్ని ఇతరులపై రుద్దడానికెప్పుడూ ప్రయత్నించరు.

కైలాసంగారి సతీమణి సావిత్రి మాత్రం గొప్ప భక్తురాలు. ఆమె ప్రతినిత్యం లక్ష్మీసహస్రం, లలితా సహస్ర నామాలతో పూజలు చేస్తేనే కాని గొంతుకలో మంచినీరు కూడా పోయదు.సావిత్రి తన పూజలు, నోములు వ్రతాలతో భర్తను ఎన్నడూ కించపర్చలేదు.

డాక్టర్ కైలాసంగారు ఫారిన్‌రిటర్న్డు. పెద్దనర్సింగ్‌హోమ్ అన్ని హంగులతో కట్టించేరు. ఆయన తన నర్సింగ్‌హోమ్‌ని చాలా శ్రద్ధగా చూసుకుంటారు. ముఖ్యంగా నర్సింగ్‌హోమ్‌స్టాఫ్‌ని, ఇన్స్ట్రుమెంట్సుని ఎన్నడూ కాళీగా వుండనివ్వరు. అదీ ఆయనలో గల ప్రత్యేకత.

డాక్టర్ కైలాసంగారు కాస్ట్లీ డాక్టర్. అతని పేషట్లంతా ధనికవర్గానికి చెందినవారే! మిడిల్‌క్లాస్, పూర్‌పీపుల్స్‌కి ఎల్లప్పుడూ ప్రభుత్వ సహాయ అండదండలుండనే వుంటాయి. వారి కోసం ఎన్నో ధర్మాసుపత్రులున్నాయి. వారికెటువంటి లోటూ వుండదు మరి! అందువల్ల మాన్యులే తప్ప సామాన్యులు డాక్టర్ కైలాసంగారి నర్సింగ్‌హోమ్ వైపు కన్నెత్తి చూడరు.

చిన్నపాముకైనా పెద్ద కర్రవుపయోగించాలని చిన్న రోగానికైనా పెద్ద ట్రీట్‌మెంటిచ్చి పేషేంట్లనెంతో తృప్తి పరిచి తను సంతోషిస్తుంటారు డాక్టర్ కైలాసంగారు. అందువల్లే గొప్ప పేషేట్లంకు ఆయనపై గొప్ప నమ్మిక.

"మా అన్నయ్య దగ్గర్నుండి ఈ రోజు మళ్ళీ ఉత్తరం వచ్చిందండి! మనందర్ని ఓపర్యాయం రమ్మనమని మరీ మరీ రాసేడు. నాలుగేళ్లనుండి వాయిదా వేస్తున్నాం! ఓపర్యాయం వెళ్ళివస్తే బావుంటుందండి!" అంది సావిత్రి డైనింగ్‌టేబుల్ ముందు కూర్చుంటున్న భర్తతో.

డాక్టర్ కైలాసంగారు మరి ఏమూడ్‌లో వున్నారోకాని భార్యమాట కాదనక సరే అన్నారు.

భర్త మనసెక్కడ మార్చుకుంటాడో ప్రోగ్రామ్ కేన్సిల్ చేసేస్తాడోనని మర్నాడు వుదయం ట్రైన్‌లోనే బయల్దేరదీసింది సావిత్రి.

ధర్మరాజు గత నాలుగు సంవత్సరాలలో ఎన్నో ఉత్తరాలు రాసేడు చెల్లెలు సావిత్రికి, బావగారు డాక్టర్ కైలాసంగార్కి. పలుమార్లు తనే స్వయంగా వెళ్ళి వార్ని ఆహ్వానించేడు.

అందుక్కారణం లేకపోలేదు. గత ఐదేళ్ళలో ధర్మరాజు పూర్తిగా మారిపోయేడు. వెల్లువలా వచ్చి పడ్తోంది లక్ష్మి. అతని పాతడాబా ఇంటి స్థానంలో మూడంతస్తులమేడ లేచింది. రెండుకార్లు, ఒకజీపు కొన్నాడు.

"అంతా ఆస్వామీజీ దయ! ఆయన ఆశీర్వాద ప్రభావమే!" అంటాడు భక్తి పారవశ్యంతో ధర్మరాజు.

"నిజమే!మరి స్వామీజీ సాక్షాత్ భగవత్ స్వరూపులు! ధర్మరాజు స్వామీజీ కృపకు పాత్రుడవడం ఎంతో పుణ్యవిశేషం!" అంటారు స్వామీజీ భక్తబృందం.

ధర్మరాజుకి స్వామీజీ పరిచయం చాలా చిత్రంగా జరిగింది. ఒకరోజు స్వామీజీ తన శిష్యులతో ధర్మరాజుగారి "గరువు"మీద మర్రినీడన విశ్రమించేరు. ఆప్రదేశం స్వామీజీనెంతో ఆకర్షించింది. వారికి కొద్దిదూరంలో పశువులు మేపుతున్న మల్లేశుని పిల్చి ఆ "గరువు" పశువులు ధర్మరాజుగారివని తెల్సుకొని వాని ద్వారా కబురు పంపేరు.

ధర్మరాజు కబురందిన వెంటనే స్వామీజీ దర్శనం చేసుకొని వారి మహిమలు కళ్ళారా చూసి ఆశ్చర్యపోయేడు.

"ధర్మరాజూ! స్వామీజీకి ఈ ప్రదేశం ఎంతో నచ్చింది. ఇక్కడే వుండాలనుకుంటున్నారు. తగిన ఏర్పాట్లు చేయించు!"అన్నారు శిష్యులు.

"నీకు త్వరలో లక్ష్మీకటాక్షం వుంది!"అన్నారు స్వామీజీ.

ధర్మారాజు ఆనందానికి అవధుల్లేవు.

ఊరికి ఉత్తరంగా రోడ్డుప్రక్కనే పాతిక ఎకరాల మెట్టవుంది ధర్మరాజుకి. ఆమెట్టను తరతారనుండి సాగుబడి చేయకుండా బంజరుగా వుంచి తమ పశువుల మేతకు

ఉపయోగిస్తున్నారు. దాన్నే "గరువు" అంటూ వ్యవహరిస్తుంటారు.

స్వామీజీ మహిమలు, శక్తి సామర్థ్యాలు కొద్దిరోజుల్లోనే చుట్టుపక్కల అనేక గ్రామాల్లో వ్యాపించి భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామీజీని దర్శించి ముడుపులు చెల్లిస్తున్నారు.

ధర్మరాజు భక్తుల సహాయంతో స్వామీజీకి చక్కటి ఆశ్రమం కట్టించేడు . వేలసంఖ్యలో భక్తులు కూర్చుని సభలు, సమావేశాలూ, ప్రార్థనలూ జరపడానికి విశాలమైన హాలొకటి ఆశ్రమానికిప్రక్కనే నిర్మింపజేసేడు.

ఆశ్రమానికి దగ్గరలో దుకాణాలకు, హొటళ్ళకు, ఇళ్ళకు కావల్సిన స్థలాలు చ॥మీటరు వందరూపాయలనుండి రెండొందల రూపాయల వరకూ అమ్మేడు ధర్మరాజు.ఆశ్రమ ప్రాంతాన్ని "స్వామీజీనగర్" అని పేరు పెట్టేరు భక్తులు. ఆశ్రమం మేనేజ్‌మెంటంతా ధర్మరాజుదే.

ధర్మరాజు పలుకుబడి రోజురోజకూ పెరుగుతోంది. ప్రభుత్వోద్యోగులు, భక్తులతో క్షణం తీరిక చిక్కటంలేదు.నిత్యం భక్తులు వేలసంఖ్యలో వస్తున్నారు. ప్రతి ఏడూ స్వామీజీ జన్మదినోత్సవాలు ఎంతో ఘనంగా జరుపుతున్నారు.

ఎన్ని వున్నా ధర్మరాజుకి మనశ్శాంతి లేకుండా వుంది. కారణం తన ఏలుబడి, పలుకుబడి ఫారిన్‌రిటర్న్డు బావగారైన డాక్టర్ కైలాసంగారు, సోదరి సావిత్రి చూడలేదన్న బాధవల్ల. అకస్మాత్‌గా ఆరోజు బావగారు సావిత్రి రావడంతో ఎంతో సంతోషించేడు ధర్మరాజు.

స్వామీజీ మహిమలు, వారి మానవాతీత శక్తి సామర్థ్యాలు అన్నీ గొప్పగా వర్ణించి చెప్పేడు. స్వామీజీ ఫొటోలు, తావీదులు, స్తోత్రావళి పుస్తకాలు ఇచ్చేడు చెల్లెలు సావిత్రికి ధర్మరాజు.

మర్నాడుదయం డాక్టర్‌కైలాసంగార్ని, చెల్లెల్ని తీసుకొని స్వామీజీ దర్శనానికి బయల్దేరాడు ధర్మరాజు. తన భర్త ఏ అడ్డు చెప్పకుండా స్వామీజీ దర్శనానికి బయల్దేరడం చూసి ఎంతో ఆశ్చర్యపోయింది సావిత్రి. అంతా స్వామీజీ మహిమేనని నమ్మింది.

ఆశ్రమం ముందు వేయిమందికి పైగా భక్తులు స్వామీజీ దర్శనార్థం కానుకలు పట్టుకొని క్యూలో నిల్చున్నారు.

"ఆక్యూ అంతా ధర్మదర్శనం కోసం." అన్నాడు ధర్మరాజు.

స్వామీజీకి తన చెల్లెల్ని, బావగార్ని పరిచయం చేసేడు ధర్మరాజు. స్వామీజీ చిరునవ్వు నవ్వి వార్ని ఆశీర్వదించేరు.

స్వామీజీ చెంతనే వున్న శిష్యులు ఆయన అరచేతుల్లో బాదంకాయంత కర్పూరం ముక్కలుంచి వెలిగించేరు.

స్పెషల్ దర్శనానికొచ్చిన భక్తులు స్వామీజీకి జేజేలు కొడ్తూ సాష్టాంగపడి కానుకలు,

ముడుపులు సమర్పిస్తున్నారు.

ధర్మరాజు, సావిత్రి హారతి కళ్ళకద్దుకొని సాష్టాంగపడి స్వామీజీకి పాదాభివందనం చేసేరు.

డాక్టర్ కైలాసంగారు చలించలేదు. నిశ్చలంగా నిల్చుని స్వామీజీనే చూస్తున్నారు.

"స్వామీజీకి అగ్నిహోత్రుడు ఆప్తమిత్రుడు. !" అన్నాడు ధర్మరాజు. స్వామీజీ మహిమను కొనియాడుతూ.

స్వామీజీ వీభూదిని భక్తులకు పంచి యిస్తున్నారు. "సంజీవి"అంటూ భక్తులు దాన్ని స్వీకరిస్తున్నారు. డాక్టర్ కైలాసంగార్కి కూడా వీభూది అందివ్వ బోయేరు స్వామీజీ.

"ఎన్నాళ్లనుండి నీకీ జబ్బు!?"అన్నారు డాక్టర్ కైలాసంగారు స్వామీజీని వుద్దేశించి.

"బావగారూ?!" అన్నాడు ధర్మరాజు కంగారుపడుతూ.

"మూర్ఖుడా! ఏం మాట్లాడుతున్నావో ఎవరితో మాట్లాడుతున్నావో తెల్సా?" స్వామీజీ శిష్యులు కోపంతో కంపించిపోయేరు.

డాక్టర్ కైలాసంగారు చిరునవ్వు నవ్వేరు.

"నేను కాదు మూర్ఖుడ్ని , మీరే ! వీడు స్వామీజీ కాడు, వీడిలో మహిమలు,మహత్యాలూ, ఏవల్లకాడూ లేదు. పచ్చిమోసగాడు. పైగా లెప్రసీ పేషెంట్.! కుష్టువ్యాధి బాధితుడికి ఎటువంటి స్పర్శజ్ఞానం వుండదు. మీకింకా అనుమానం తీరకపోతే వాడి కాషాయబురఖా తీసి చూడండి! వాడి బండారం బయటపడ్తుంది" అంటూ బయటకు వస్తూ ఎదురుగా నిల్చున్న ఇనస్పెక్టర్ని చూసి "ప్లీజ్ ఎరెస్ట్‌దెమ్"అన్నారు డాక్టర్ కైలాసంగారు.

**("స్వాతి" మాసపత్రిక, మే 1980)** ✪